క్లుప్తంగా

క్రీడాసామగ్రి వితరణ

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలకు పాలిటెక్నిక్ కాలేజీ రిటైర్డు పీడీ నాగస్వరూప్ క్రీడా సామగ్రిని హెచ్ఎం రుషికేశవ్‌కు అందజేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హాకీ స్టిక్స్, బాల్స్ అందించారు. వీరితో పాటు వాల్మీకిపురంకు చెందిన హరి బాస్కెట్ బాల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పీఈటీలు నాగరాజ, నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలి

తంబళ్లపల్లె: ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా కొత్త ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు వీఆర్వోలు, బీఎల్‌వోలు సమష్టిగా కృషి చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి నెల రోజులపాటు బీఎల్‌వోలు, వీఆర్వోలు స్పెషల్ క్యాంపెన్ నిర్వహించాలన్నారు. బీఎల్‌వోలు వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబంలోని ఓటర్ల వివరాలు, మరణించి ఉంటే వారి వివరాలు ఓటర్ల జాబితాలో చేర్పించాల్సిన యువతి, యువకులు, వలసవెళ్లిన వారి వివరాలు సమగ్రంగా సేకరించాలన్నారు.

కురుబలు ఐకమత్యంగా ఉండాలి

మదనపల్లె : కురుబలు ఐకమత్యంగా ఉంటూ, రాజ్యాధికారం కోసం కలిసికట్టుగా పోరాడాలని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల కురుబసంఘం అధ్యక్షులు కప్పలరాజన్న, గుడే శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కురుబలు రాజకీయంగా ఎదగాలన్నదే తమ ధ్యేయమన్నారు. ఆరేళ్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ, కురుమ సంఘం(13/2017) ఆధ్వర్యంలో రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గ కమిటీలను ఏర్పాటుచేసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె పట్టణ కురుబసంఘం అధ్యక్షులు జి.రామాంజులు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ ఆక్రమణపై ఫిర్యాదు

కలికిరి: మండలంలోని పల్లవోలు గ్రామంలో హంద్రీ కాలువ భూమి ఆక్రమణపై స్థానికులు సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు అందజేశారు. గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి డీకేటీ పట్టా పొంది హంద్రీ కాలువను పూడ్చి వేసి మొక్కలు నాటుకుందని, ఇదే విషయమై రెవెన్యూ అధికారులకు తెలియచేసినా చర్యలు తీసుకోక పోవడంతో జిల్లా ఉన్నతాధికారులను ఆశ్రయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె: స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని టీవో నాగరాజు తెలిపారు. పిట్టర్, ఎలక్ట్రీషియన్, సివిల్ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు రెండవ విడత దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి పాస్, ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై శిక్షణ

పెద్దతిప్పసముద్రం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో భాగంగా సోమవారం వ్యాధి నిరోధక టీకాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాతా, శిశు మరణాలను తగ్గించే విధానం, పిల్లలకు, గర్భిణులకు టీకాలు వేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉషశ్రీ, డాక్టర్ పురుషోత్తం నాయక్, డాక్టర్ యస్థానీ, సీహెచ్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె : సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన మదనపల్లెకు చెందిన జస్టిస్. సరస వెంకటనారాయణ భట్‌ను సోమవారం బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పట్టణంలోని సొసైటీకాలనీలోని ఆయన నివాసానికి వెళ్లిన మదనపల్లె బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.జనార్ధనరెడ్డి, జనరల్ సెక్రటరీ జి.మనోహరలు ఆయనకు అభినందనలు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యయత్నం

మదనపల్లె: కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లె రామిరెడ్డిలేవుట్‌కు చెందిన కె.లక్ష్మీనారాయణ(62)కుటుంబ సమస్యల కారణంగా ఇంటిలోనే యాసిడ్ తాగి ఆత్మహత్యయత్నంకు పాల్పడ్డాడు.

గృహ నిర్మాణ సంస్థ అధ్యక్షుడిగా గంగిరెడ్డి

ములకలచెరువు: ములకలచెరువు మండల శ్రీ సత్యసాయి సహకార గృహ నిర్మాణ సంస్థ అధ్యక్షుడిగా గంగిరెడ్డి ఏకాగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల కేంద్రం సింగిల్ విండో కార్యాలయంలో ఎన్నికల అధికారి ఖాసీం సాహెబ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. సంఘం ఉపాధ్యక్షుడిగా రెడ్డి మౌలాలి, సభ్యులుగా నరసింహులు, నాగభూషణ, బావాజాన్‌లను ఎన్నుకున్నారు.

పేదల సంక్షేమమే జగనన్న ఆశయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : పేద ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే అగ్రహారం పంచాయతీ ఎనుమలవారిపల్లె, కంభంమిట్టపల్లె, ఆరెంవారిపల్లె, ఎల్లెలవారిపల్లె తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి నాలుగేళ్లలో లబ్ధి పొందిన వివరాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబం రూ. లక్ష నుంచి రూ. పది లక్షల వరకు ప్రభుత్వం ఆర్థికంగా లబ్ధి పొందినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఆలోచనలతో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దూసుకుపోతోందని చెప్పారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో ఒక వర్గానికి మాత్రమే పథకాలు అందించేదని తెలిపారు. అదే ప్రస్తుతం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కుల మత వర్గాలకు అతీతంగా అన్ని వర్గాలకు పథకాలు అందిస్తున్నారని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఏదో విధంగా సంక్షేమ పథకాలు అంది ఆర్థిక లబ్ధి చేకూరుతోందని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు అప్పటికప్పుడే సంబంధిత కారులకు తెలిపి పరిష్కరించాలని ఆదేశించారు. అర్హత ఉండి చిన్నచిన్న కారణాలతో ఇంకా ప్రభుత్వ పథకాలు ఎవరికైనా అందకుండా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటివి సరిచేసి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ యల్లయ్య, వైస్ ఛైర్మన్ రమేష్‌రెడ్డి, సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, నాయకులు బాలం నరేంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, అహ్మద్‌బాషా, రూపేష్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, లోకనాథరాజు, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

మరోమారు జగనన్నను ఆశీర్వదించండి

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా



జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించామని, సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మంచి జరిగిందన్న నమ్మకం ఉంటే మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని ఎస్‌బీఐ కాలనీ, ప్రశాంత్‌నగర్ వార్డు సచివాలయాల పరిధిలో కమిషనర్ కే.ప్రమీల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, కౌన్సిలర్లు డిష్‌రామకృష్ణారెడ్డి, సరితా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదలందరికీ మంచి జరగాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు, అభివృద్ధిపనులు చేస్తున్నామన్నారు. దేశంలోనే పేదల కోసం ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలుచేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏడాదిపాటు పట్టణంలోని 35వార్డుల్లో పర్యటిస్తే.. వెళ్లిన ప్రతిచోటా ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తి వ్యక్తపరిచారన్నారు. వార్డులో ప్రజలు తెలిపిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 10,326 సర్వీసులు ప్రజలకు అందజేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాలగంగాధరరెడ్డి, ఎస్. ఇర్ఫాన్‌ఖాన్, షరీఫ్, గుండ్లూరురఫీ, జేసీఎస్ ఇన్‌చార్జ్ మునిశేఖర్, శ్యామ్‌కుమార్‌రెడ్డి, రవికుమార్, పద్మప్రియ, రామకృష్ణ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.9.80 కోట్లతో కొత్త రోడ్లు మంజూరు

-ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



బి.కొత్తకోట: బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, కురబలకోట మండలాల్లో మూడు ఆర్అండ్‌బీ రోడ్లకు రూ.9.80 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట–బడికాయలపల్లె–స్టేట్‌బార్డర్ రోడ్డుకు రూ.కోటి, మద్దయ్యగారిపల్లె సమీపంలోని జింకలమిట్ట నుంచి కందుకూరు మీదుగా ఐదు కిలోమీటర్ల రోడ్డుకు రూ.కోటి, ముదివేడు–తంబళ్లపల్లె–పెద్దమండ్యం రోడ్డుకు రూ.7.80 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. బి.కొత్తకోట–శంకరాపురం–స్టేట్‌బార్డర్ డబుల్‌రోడ్డు పనులు రూ.23 కోట్లతో చేపట్టగా పనులు కావస్తున్నట్లు చెప్పారు. ఈ మార్గంలో కంబాలపల్లె వద్ద ఆలేరువాగుపై రూ.6.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి డిజైన్ సిద్ధమైందని, త్వరలో టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభింపజేయనున్నట్టు చెప్పారు. రంగసముద్రం–పెద్దపాళ్యం రోడ్డు విస్తరణ పనుల కోసం రూ.30 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదించామని చెప్పారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

రామసముద్రం: మండలంల ఎలవానెల్లూరు పంచాయతీ అనప్పల్లి వద్ద సోమవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లును సీజ్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. అనప్పల్లి గ్రామానికి చెందిన పూల చంద్రమోహన్, అదే గ్రామానికి చెందిన మద్దిలేటి నాగేంద్రకు చెందిన ట్రాక్టర్లు చిన్నకుంట చెరువులో ఇసుకలోడ్ చేస్తుండగా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కారంచేడు వీరులకు వీసీకే పార్టీ నివాళి



కారంచేడు వీరులకు వీరవందనాలు సమర్పిస్తున్న వీసీకే పార్టీ నాయకులు

మదనపల్లె : కారంచేడు కులనిర్మూలనా సమరవీరుల స్మారకదినం సందర్భంగా సోమవారం స్థానిక బెంగళూరురోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద వీసీకే పార్టీ ఆధ్వర్యంలో కారంచేడు వీరులకు వీరవందనం కార్యక్రమం జరిగింది. ముందుగా వీసీకే నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తర్వాత కులనిర్మూలనాసమరంలో నేలకొరిగిన కారంచేడు–చుండూరు యుద్ధవీరులకు నివాళులు అర్పించి వీరవందనాలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ మాట్లాడుతూ.. అగ్రకుల రాజ్యాన్ని గజగజలాడించిన కంచికచర్ల, కారంచేడు, చుండూరు కులనిర్మూలనా పోరాటాల స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో దళితులు తమపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా మరో స్వాతంత్ర్యపోరాటానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో పోతబోలురెడ్డెప్ప, ముత్యాలమోహన్, బురుజులక్ష్మీనారాయణ, గిన్నెలమనోహర్‌రెడ్డి, రాయల్‌సూర్య, సొన్నికంటిరెడ్డెప్ప, రవిశంకర్, తలారికృష్ణ, శశికుమార్, బురుజురెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్దాం

కలికిరి: కారంచేడు ఉద్యమ స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమిద్దామని భారతీయ అంబేద్కర్ సేన(బాస్) జిల్లా కో–కన్వీనర్ పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కారంచేడు అమరుల సంస్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలికిరిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బాస్ నేతలు గురునాధ, గంగాధర్, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, ఆబిద్, చంద్రయ్య పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నగదు బహుమతి

మదనపల్లె సిటీ: పదో తరగతిలో సాధించిన మార్కుల స్ఫూర్తితో ఉన్నత చదువులలో కూడా రాణించాలని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థులు గులాం రసూల్‌ఖాన్, రెడ్డి రాఘవి,సుమిత్ర, నరహరిలకు సోమవారం పాఠశాలలో ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒక్కో విద్యార్థికి రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యతు సాధ్యపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు, మెడల్స్, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఉపాధ్యాయులు మహమ్మద్‌ఖాన్, ఆర్‌వి రమణ, నాగరాజు, రాజారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం: స్థానిక పట్టాభిరామాలయంలో సోమవారం శ్రీరాముడి జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ఉత్సవ మూర్తులను ముస్తాబు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.


నాలుగు నెలలుగా రేషన్ ఇవ్వడం లేదని ఫిర్యాదు

గుర్రంకొండ: పట్టణంలో నాలుగు నెలలుగా రేషన్ ఇవ్వడం లేదంటూ మహిళలు, గ్రామస్తులు తహసీల్దార్ ఖాజాబీకి ఫిర్యాదు చేశారు. సోమవారం పట్టణంలోని మహబూబ్ నగర్, బజారు వీధికి చెందిన మహిళలు, గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఎండీయూ ఆపరేటర్లు బియ్యం ఇవ్వడం లేదంటూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు, చౌకదుకాణ డీలర్లు పట్టణంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నెలల తరబడి తిరుగుతున్నా రేషన్‌తో పాటు ఎలాంటి సరకులు ఇవ్వడం లేదన్నారు. రేషన్‌షాపు డీలర్లు తమకు బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని ఎండీయూ ఆపరేటర్లు, కాదు ఎండీయూ ఆపరేటర్లే సక్రమంగా మీకు రేషన్ బియ్యం ఇవ్వడం లేదని చౌకదుకాణ డీలర్లు సాకులు చెప్పుకొంటున్నారని ఫిర్యాదు చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఎవరికైనా ఫిర్యాదు చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారన్నారు. ఎండీయూ ఆపరేటర్లు, చౌకదుకాణాల డీలర్లపై విచారణ చేసి పూర్తి స్థాయి నివేదిక అందజేయాలని డీటీని తహసీల్దార్ ఆదేశించారు.

మామిడి మొక్కల అంటుతో స్వయం ఉపాధి

కలికిరి: మామిడి మొక్కల అంటు పద్ధతితో యువత స్వయం ఉపాధి పొందవచ్చని కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ అన్నారు. ఐసీఏఆర్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేవీకేలో యువతకు మామిడి మొక్కలకు అంటు కట్టు పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి మొక్కలకు డిమాండ్ మెండుగా ఉన్నందున అంటుకట్టడం నేర్చుకోవడం వలన గ్రామీణ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. నర్సరీ మొక్కలు పెంపకం, అంటు కట్టడం, స్టాక్ ఎంపిక తదితరాలను కేవీకే నర్సరీలో ప్రయోగాత్మకంగా వివరించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



నిధుల మంజూరు పత్రాలను ముతవలీకి అందజేస్తున్న ఎండీసీ అధ్యక్షుడు, అధికారులు

పెద్దమండ్యం: మండలంలో వివిధ అభివృద్ధి పనులకు ఎంపీ మిథున్‌రెడ్డి రూ. 34 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్ తెలిపారు. అభివృద్ధి పనుల వివరాలను సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివరించారు. మండలంలోని కలిచెర్ల, పెద్దమండ్యం ప్రాంతాలలో బస్టాండుల నిర్మాణానికి ఒక్కోచోట రూ. 15 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే ఎన్‌వోపల్లె పంచాయతీ కలిచెర్ల పాతూరులోని జామీయా మసీదులో అభివృద్ధి పనులకు రూ. 4 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించిన ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. మసీదు కమిటీ ముతవలీకి నిధుల మంజూరు పత్రాలను అధికారులతో కలిసి ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, సర్పంచ్ బాషా, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా పనిచేయాలి

కలకడ : లక్ష్యసాధన దిశగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని సిబ్బంది పనిచేయాలని జిల్లా జాతీయ ఆరోగ్యమిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ లోకవర్ధన్ ఆదేశించారు. సోమవారం కలకడ పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఎన్‌సీడీ, సీడీ సర్వే, ఆరోగ్యశ్రీ పరిధిలోని ఏఎన్ఎంలు వెక్టార్ కంట్రోల్, ఆర్‌సీహెచ్ పోర్టల్ నిర్వహణ, సమితికాతాల నిర్వహణ వందశాతం పూర్తి చేయాలన్నారు. సచివాలయం పరిధిలోని హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లు సమయం ప్రకారం సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ మోహన్, సిబ్బంది వెంకటేశ్వరరావు, రమణమ్మ, మహమ్మద్‌రఫీ, రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జయంతి



అమ్మవారికి పొంగళ్లు తీసుకెళ్తున్న భక్తులు

రామసముద్రం: మండలంలోని గుంతలపేట గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతి ఉత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, విశేషాలంకరణ నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రాదాలు అందించారు. అలాగే ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మహిళలు ఉపవాస దీక్షలతో అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. అమ్మవారి దర్శనం కోసం మండల నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు.

తంబళ్లపల్లె: మండలంలోని బురుజులో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో సోమవారం దయాలవారి దాయాదులు, తొగటవీర క్షత్రియలు ఇలవెల్పు దేవత చౌడేశ్వరిమాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూజారి శ్రీరాములు అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కలకడ : చౌడేశ్వరిదేవి జయంతిని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం మండలంలోని కలకడ, గుడిబండ, కోన, కదిరాయచెర్వు, కె.బాటవారిపల్లె గ్రామాల్లోని చౌడేశ్వరిదేవి ఆలయాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

మదనపల్లె సిటీ: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో సోమవారం అమ్మవారి జయంతి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. తొగటవీరక్షత్రియ సంఘం, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేక పూలమాలలతో వెండి ఆభరణాలతో అలంకరించారు. జయంతిని పురస్కరించుకుని మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



కరోనా బాధితులకు అండగా..



కరోనా సోకిన ఇంటిని సందర్శిస్తున్న వలంటీర్ ఖాజా హుస్సేన్

ఈ ఫోటోలో ఉన్న వలంటీరు పేరు ఖాజా హుస్సేన్. కరోనా కష్టకాలంలో తన పరిధిలోని ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తూ కరోనా సోకిన వ్యక్తులకు ట్రీట్మెంట్ అందించడంలో సహాయం అందిస్తూ, వాళ్లకు మందులు ఇప్పించడంలో సహాయంగా ఉంటూ ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్తూ వాళ్లకు అండగా తోడుగా వాళ్ల సమస్యలపై సచివాలయంలో ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాడు. వలంటీర్ సేవలను ఆ ప్రాంత ప్రజలు ఇప్పటికీ గుర్తు చేస్తున్నారు. **- వాల్మీకిపురం**

వలంటీర్లకు రుణపడి ఉంటాం



కరోనా సమయంలో వలంటీర్ల గొప్ప సేవలు చేశారు. నా విషయానికొస్తే ఓ కొడుకులా అండగా నిలిచాడు. కరోనా సోకడంతో ఏమౌతుందోనని భయపడుతున్న తనకు ధైర్యానిచ్చాడు. పాటించాల్సిన పద్ధతులను వివరిస్తూ కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాలని సూచించాడు. అమ్మ ఒడి, వాహన మిత్ర, ఆరోగ్యశ్రీ లబ్ధి, వైఎస్సార్ ఆసరా చేకూరాయి. వలంటీర్ల సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. **- సబీహా, కోనేటివీధి, వాల్మీకిపురం**

నిస్వార్థ సేవకులు వలంటీర్లు



తిరుపతిలో మంచంపై ఉన్న నిఖిలకు పింఛన్ డబ్బులు అందిస్తున్న వలంటీర్ షీబారాణి (ఫైల్)

బోన్ టీబీ వ్యాధితో బాధపడుతున్న ఏడేళ్ల చిన్నారి ఈ.నిఖిల. ప్రాణాపాయ స్థితిలో తిరుపతిలో చికిత్స పొందుతూ బంధువుల ఇంట్లో ఉంటోంది. ఆర్థికంగా వారి పరిస్థితి అంతంతమాత్రం. బిడ్డకు వచ్చే దివ్యాంగ పింఛన్‌తోనే తల్లి లక్ష్మీదేవి వైద్యం చేయించేంది. అలాంటి వారి పరిస్థితిని గుర్తించిన వెంకప్పకోట సచివాలయం తురకపల్లెకు చెందిన వలంటీర్ వి.షీబారాణి గ్రామం నుంచి 130 కిలోమీటర్ల దూరంలోని తిరుపతికి వెళ్లి ఇంటి అడ్రస్ వెతికి మరీ ఫింఛన్ అందించి వచ్చింది. ఇలా ఒక నెల కాదు... ఏకంగా మూడునెలలు. ప్రతినెలా తన జీతం నుంచి ఖర్చుచేసుకుని నిస్వార్థంగా సేవలందించింది. దురదృష్టవశాత్తు పాప నిఖిల మరణించినా, కష్ట సమయంలో వలంటీర్ అందించిన సేవను, అండగా నిలిచిన వైనాన్ని ఆ కుటుంబం నేటికీ మరువలేకపోతోంది. **- మదనపల్లె**

కష్ట సమయంలో ఆదుకున్నారు



బిడ్డ ఆరోగ్యం బాగోలేక మంచం మీద నిర్జీవంగా పడి ఉన్న సమయంలో దిక్కుతోచని స్థితిలో డబ్బులకు ఎవరిని అడగాలో తెలీక బాధపడుతున్నాం. ఠంచనుగా ఒకటోతేదీ మధ్యాహ్నంకు తిరుపతికి వచ్చి పెన్షన్ డబ్బులు తీసుకో అక్కా.. అంటూ మా వలంటీర్ షీబారాణి ఆస్పత్రికి వచ్చి అందించడం కష్ట సమయంలో కొండంత భరోసాగా అనిపించింది. గతంలో ఎవ్వరూ ఈ విధంగా ఆదుకున్న వారు లేరు. వలంటీరు వ్యవస్థను ప్రవేశపెట్టిన సీఎం. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. **- ఈ.లక్ష్మీదేవి, తురకపల్లె, మదనపల్లె**